

# భయపడిన శాంత

పెళ్ళయిన వెంటనే శాంతని తల్లిదండ్రులు కాపురానికి భర్తదగ్గరికి పంపించేశారు. అప్పటి కామెకు పధ్నాలుగేళ్లు. అయితే పిల్ల బరువైపోయి, ఆబరువునెలాగో వదిలించుకుందా మనే ఉద్దేశ్యంతో తల్లిదండ్రులామెను పంపించేశారనుకోవడం పొరబాటు. సంప్రదాయం అతిక్రమిస్తే వచ్చే అగౌరవాన్నీ, అపనిందల్నీ భరించడానికి జడిసి, ఆ తండ్రి కాళ్లరిగిపోయేలా తిరిగి, తానివ్వగలిగిన, లేక యివ్వదలుచుకున్న మూడువేల కట్నంలోనూ, తనకూ తన కూతురికీ నచ్చే వరుడు దొరకక, కట్టకడకు శాంత కోరిక ప్రకారం ఒక చదువుకున్న యువకుణ్ణి దాదాపు పాతికేళ్ళవాడిని, మూడువేలు కట్నం యిచ్చుకుని శాంతకు కట్టిబెట్టాడు. శాంత అదృష్టమో, భగవంతుడి అకారణానుగ్రహమో అన్నట్టా యువకుడు పాతికేళ్లువచ్చినా తన లేతదనం పోగొట్టుకోని వాడు కావడం వల్లా, శాంత మనసారా అతని చేతుల్లోకి వెళ్ళిపోయింది. చదువుకున్న యువకులలో సాధారణంగా ఉబికే ఆశలూ, ఆదర్శాలూ, పెండ్లికుమార్తెపట్ల వారుకోరే గుణగుణాలూ శాంతలో లేకపోయినా, పదునూ మాధుర్యం రెండు గుణాల ద్వారా శాంత తన భర్తను ఆక్రమించుకోగలిగింది. ఆ తలిదండ్రులకు ఒక్కటే ఆడపిల్ల. సంక్రమించిన వగరైన పెంకితనం, తగుపాటిగా అజ్ఞానం, ఆమెను కొంత అసహాయనుగా చేశాయి. ఏ తత్కారణాత్, ఆమె భర్తతో కాపురానికి పట్నం వెళ్లే మొదటి రోజుల్లో, గృహనిర్వహణార్థం అత్తింటి ఆడబడుచు ఆ పిల్లకితోడు రావలసి వచ్చింది. పుట్టింట సాగినట్టు అత్తింట సాగదని శాంతకు సగం తెలుసునుగాని పూర్తిగా తెలియడానికి తగిన వయః పరిపాకం మనః పరిపాకం లేవు. అందువల్ల ఆమెలోని లోట్లను, ఆడబడుచు సహించగలిగేది కాదు. ఆడబడుచు స్వతహాగా సహజంగా నేర్పరి; లోకజ్ఞానం విజ్ఞానం కలిగిన వ్యక్తి శాంత భర్తలో మంచితనం చేతకాని తనంగా యెంచబడుతూఉన్నా, శాంతకు భర్త దగ్గరలేని క్షణం జ్వరంలా తలనొప్పిలా శూన్యంలా వేడిగా వంటరితనంగా మారిపోయేది-ఎవరినీ చెండనాడుకోవడం అంటే యిష్టంలేని ఆమె భర్త సానుభూతి, అనునయం ద్వారానే సర్వం సాధించాలని యెంచేవాడు.

ఈరీతిగా శాంత కాపరం యిరవై రోజులు గడిచేసరికి చాపాచెంబూ యిచ్చి వేరే కూచోమన్నారు. అది మూడురోజుల ప్రవాసం. మొదటిరోజు కాలక్షేపం యెలా చెయ్యాలో తెలియక, కాసేపు బియ్యపు గింజల్లో వడ్లగింజలేరింది. భర్త చదువుకోమని యింతలావు "వేయిపడగ"లిస్తే ! చదవలేక మానేసింది. నిద్ర కమ్ముకుంది.

సూరంపూడి భాస్కరరావు

*　　　　*　　　　*

పట్నంలో చిన్న గదిలో వాలుకుర్చీలో భర్తఒళ్లో కూర్చుంది శాంత, కమలపాకులు నములుతూ. పక్కను పందిరిమంచం, మంచంమీద పరుపూ రెండు దిండ్లూ, యింకో వైపున పుస్తకాలు వత్తుగా పేర్చిన షెల్ఫూ; ఒక చిన్న వ్రాతబల్లా, దానిమీద అద్దం, పౌడరు డబ్బా, కాలుతూన్న గంధపుపొడి, ఒక రైటింగు పాడ్డూ; ఇంకో ప్రక్కగా కంచాలూ, గిన్నెలూ, జాడీలూ, అమర్చిన యినపషెల్ఫూ అన్నీ సాక్షాత్కరించాయి. తలుపులు మూసిన గదిలో అపరాహ్ణపు సన్నని వెలుతురులో శాంతా, భర్తా నిశ్చింతంగా కూర్చున్నారు

ఇంతలో ఎవరో తలుపు తట్టారు.

"ఎవరు?" అన్నాడు భర్త. ఆడబడుచు చుట్టాలని చూడటానికి ఊళ్లోకి వెళ్లింది. తలుపు తట్టినవారు సమాధానం చెప్పకుండానే తలుపు మళ్లీ తట్టారు.

"ఎవరంటే పలకరేం!" అని గద్దించాడు భర్త.

"నేనే, తలుపు తియ్యమ్మా" అన్నారు తలుపు వెనక.

"నేనంటే?" అన్నాడు శాంత భర్త మళ్లీ.

"నేనే. తలుపు తియ్యరాదూ తెలుస్తుంది" అని సమాధానం.

"మా నాన్నలా ఉందండీ" అంది శాంత.

"మీనాన్న యీ వేళప్పు డెందుకొస్తాడు? ఉత్తరం పత్రం లేకుండా మూడువందల మైళ్లు రైలుప్రయాణం చేశాడంటావా?"

"మా నాన్నేనండీ- ఆగొంతు తెలియడంలే?"

"అబ్బే కాదు, నీకేం మతిపోయిందా?"

"పోనీ, తలుపుతీసి చూద్దాం ఉండండీ-"

తలుపు తీసేసరికి శాంత తల్లీ తండ్రీ అక్కడ నిలబడి ఉన్నారు.

"నే చెప్పానా, అరుగో మా అమ్మా మా నాన్నాను. ఇప్పుడైనా నమ్ముతారా?"

"ఇప్పు డెందుకు వస్తారా అనుకున్నాను. రండి" అని చొక్కా కండువా వేసుకుంటున్నాడు.

"ఏమిటి చొక్కా కండువా తీస్తున్నావు, బయటి కెడుతున్నావా?" అన్నాడు శాంత తండ్రి.

"మరేనండి, కొంచం అర్జంటుగా పని ఉంది మళ్లీ యిప్పుడే వస్తాను" అన్నాడు శాంతభర్త.

"అదేమిటోయి, ఓప్రక్కనుంచి మేం రావట మేమిటి? నువ్వలా వెళ్లిపోవట మేమిటి."

"కాదండీ. చాలా అవసరమైనపని. ఏమీ అనుకోకండి, కూర్చోండి, వెంటనే వస్తా మళ్ళీ."

"వెడుదు గానిలే రెండునిముషాలుండి. మేమూ వెళ్ళిపోతాం నీకంత యిష్టం లేకపోతే"

"ఇష్టం లేకపోవడం కాదండీ" అంటూనే బయటికి వెళ్ళి పోయాడు శాంతభర్త. వెంటనే శాంత తల్లీ తండ్రి కూడా మరో బ్రోవపట్టి నిష్క్రమించారు. ఆడబడుచు అంతకు ముందే లేదు. ఒక్కతే బొమ్మలా నిల్చుండి పోయింది శాంత ఇదేమీ అర్థంకాక.

ఒక గంట గడిచింది రెండు గంటలు గడిచాయి. చీకటి పడింది. శాంత మనస్సు పనిచెయ్యటం లేదు. ఆకలివేసింది. అన్నం తిందా మనుకుంది. కాని భర్త రాలేదు. బెంగటిల్లి పోయిన కొద్దీ మొండిధైర్యం కలుగుతోంది. క్రిందటి రోజున తానూ, తనభర్తా, ఆడబడుచూ క్రింద వాటాలో ఉన్న స్నేహితులూ సముద్రపొడ్డుకి వెళ్ళడం జ్ఞాపకం వచ్చింది.

తిన్నగా వంటరిగా సముద్రపొడ్డుకు వెళ్ళి, తన తెలివినంతా ఉపయోగించి ట్రిప్లికేన్ బీచ్ నుంచీ చీపాక్ బీచిదాకా అంతా వెతికింది. భర్త కనబడలేదు.

కెరటాలు మాత్రం కొట్టుకుంటున్నాయి. సముద్రం హోరెత్తుతోంది.

బరువుగా యింటికి తిరిగివచ్చి క్రిందవాటాలో ఉన్న రాజేశ్వరిని పిల్చింది.

"ఏం శాంతా, మీ ఆయన మధ్యాహ్నమనగా యిప్పుడే వస్తానని వెళ్లాడు, యింకా రాలేదా." అన్నది రాజేశ్వరి.

"రాలేదు" అంది శాంత.

"నువ్వన్నం తినలేదా మరి?"

"లేదు"

"పోనీ మా యింటిలో తినరాదూ మనిద్దరం తిందాం"

శాంత వినిపించుకోకండా మేడమీదికివచ్చి తలుపు తాళం వేసింది. తిన్నగా దిగివచ్చి రాజేశ్వరి చేతుల్లో తాళం చెవులు పెట్టి "ఆయనగాని,

మా వదినగారుగాని వస్తే యీ తాళంచెవులు యిచ్చేయండి" అని వెళ్ళిపోయింది.

మళ్ళీ తిన్నగా సముద్రపొడ్డుకి చేరుకుంది. సముద్రంలో గబగబా దిగింది. మొలలోతు, గుండెల్లోతు, పీకె లోతువరకూ దిగింది; "ఇంక ఒక్క కెరటంవచ్చి నాకు కావలసినదని పూర్తి చేస్తుంది కదా" అనుకుంది.

కాని అదేమాశ్చర్యమో, ఆమె నుంచున్న చోట యిసకగుట్టగా మారుతూంది. ఆ గుట్ట అంతకంతకు పైకి లేచిపోతోంది. నీటిమీద యిరవై అడుగుల యెత్తున లేచింది. శాంత కాళ్ళు మాత్రం యిసకలో కూరుకుపోయి ఉన్నాయి. శాంత లోలోపల ఉక్కిరిబిక్కిరి ఐపోయింది. లోలోపల గిలగిలా తన్నుకుంది. తన్నెవరో దగా చేస్తున్నారని భయపడింది. ఆశ్చర్యంగా మళ్ళీ ఆ గుట్ట సముద్రంలోకి దించుకుపోయింది. ఈ మారు శాంత ముందుకుపోలేదు. అక్కడ నిల్చోలేదు కూడా. ఒడ్డుకు నడిచిపోయింది. మనస్సులో తాను దాటివచ్చిన కాలవ జ్ఞాపకం వచ్చింది తిన్నగా రోడ్డెక్కి నడుస్తోంది కాలవ వైపుకి.

ఆకాలవ కుళ్ళుకాలవో మంచి నీటికాలవో శాంతకి తెలియదు. అది కాలవ అనీ, దానికి లోతుంటుందనీ తెలుసును. అంతకుమించి తనకు కావలసింది లేదు.

వచ్చివచ్చి శాంత, వంతెన పక్కగా కాలవలోకి ఉరికింది. మునిగిందేమో, మళ్ళీ తేలిందేమో. ఎవరో చూశారేమో, అంత చుట్టూ చేరి ఆమెను బయటికి లాగారు. ఆమె ఊపిరి పోలేదు, స్మృతిపోలేదు. ఇంతలో ఏ చాయ నుంచి వచ్చాడో, భర్త శాంతని ఒళ్ళోకి తీసుకున్నాడు.

"ఎవర"ని అడిగారు కాబోలు ఆ చుట్టూ ఉన్నవాళ్ళు.

"నా భార్య" అని చెప్పాడు కాబోలతను.

చుట్టూ వాళ్ళు ఎవరిమటుకు వాళ్ళు తప్పుకున్నారట. శాంత కళ్ళు తెరిచేసరికి భర్త కళ్ళు కనిపించాయి. తన ఒంటిని సోకుతున్నాయి తన భర్త చేతులు. చల్లగా ముద్దు పెట్టుకున్నాడు భర్త. శాంత లేచి నుంచుంది.

* * *

ఇది ఆనాటి మధ్యాహ్నం నిద్దట్లో శాంతకు వచ్చిన కల మరి శాంతకు యీ కల యెందుకు రావలసి వచ్చిందో, యింత సక్రమంగా యెలా అంతమయిందో. చెప్పడం కష్టం. శాంత భర్త మామగారొస్తే అలా వెళ్ళిపోడే! ఒకవేళ వెళ్ళినా మామగారు అత్తగారూ కూతురుదగ్గర కాసేపు కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడవచ్చు! ఆడబడుచు అంత అజాగ్రత్తగా విడిచి వెళ్ళదే! భర్త వెళ్ళినా రావడానికి ఆలస్యం చెయ్యడే! సముద్రంలో ఇసక గుట్ట లేవడమేమిటి! ఏమిటో! ఎంత నిజం అనిపించినా, ఎంత భయమేసినా భగవంతుడి దయ వల్లా నిజాని కిదంతా కలేకదా! కలే! కాని అమాయకలైన ఆడపిల్లల మనసులో మూలలో చిరుచీకటిలో ఇలాంటి కలలు ఎందుకుంటాయో?

ఈ క్రింది ఊళ్ళలో ఇంగ్లీషు, తెలుగు 'స్వతంత్ర' పత్రికలు అమ్ముటకు,

ఏజెంట్లు కావలెను:

బళ్ళారి, చోడవరం, చల్లపల్లి, ముద్దనూరు, నాగపూరు, నరసీపట్నం, పొన్నపల్లి అగ్రహారం, శృంగవరపుకోట, వెల్లూరు, ఎలమంచిలి, కైకలూరు

వివరములకు :—

మేనేజరు, 'స్వతంత్ర'

160 లాయిడ్స్ రోడ్, రాయపేట, మదరాసు-14.